సాక్షి
మంచిర్యాల
శనివారం, 16, డిసెంబర్, 2023



సర్కారు బడుల్లో సౌర వెలుగులు

సర్కారు పాఠశాలల్లో సోలార్ వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ భారం తగ్గించేందుకు విద్యాశాఖ, టీఎస్ రెడ్‌కో ఈ పథకం అమలుకు నిర్ణయించాయి. 8లో▸

ఎన్నికలపై స్టే కోరుతూ కోర్టుకు

శ్రీరాంపూర్: ఈ నెల 27న జరగాల్సిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై స్టే కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి గురువారం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఎన్నికల కేసులపై హైకోర్టు ఈ ఏడాది అక్టోబర్ 10న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు కంపెనీ ఎన్నికల నిర్వహణకు పూనుకోగా ప్రభుత్వం నుంచి తాజాగా ఈ తీర్పుపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలైంది. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కేసు వేశారు. ఈ నెల 18న దీనిపై వాదనలు జరగనున్నాయి. కంపెనీ కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయినట్లు తెలిసింది.

గరిష్టం/కనిష్టం
28.0 /16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

మంత్రి యోగమెవరికో !

- కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అమాత్య ఆశలు
- రేసులో 'గడ్డం' సోదరులు, పీఎస్సార్
- ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు





ప్రేమ్‌సాగర్‌రావు



గడ్డం వివేక్



గడ్డం వినోద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో 'మంత్రి'పదవి కోసం సీనియర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మంత్రివర్గ మొదటి విస్తరణలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం దక్కలేదు. దీంతో అంతా రెండో విడత విస్తరణపైనే ఆశలు పెట్టుకున్నారు. మరికొద్ది రోజుల్లోనే రెండో విడత కేబినెట్ విస్తరణ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరికి వారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలను ప్రభుత్వ విప్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విప్ పదవుల్లోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఎవరూ లేరు. దీంతో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో కేబినేట్‌తోపాటు ఇతర కీలక పదవుల్లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జుతోపాటు మరో ముగ్గురు సీనియర్ నాయకులు పోటీలో ఉన్నారు. వీరందరిలో ప్రధానంగా ముగ్గురు సీనియర్ల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది.

'గడ్డం' సోదరుల పోటీ..

'గడ్డం' సోదరులు ఇద్దరూ మంత్రి పదవిపై నమ్మకం పెట్టుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి గెలిచిన గడ్డం వినోద్, చెన్నూరు నుంచి గెలిచిన వివేక్ ఒకరితో ఒకరు పదవి కోసం పోటీ పడుతున్నారు. ఒక దశలో వివేక్‌కు మొదటి కేబినెట్ విస్తరణలోనే బెర్త్ ఖాయమని ఆయన అనుచరులు చెప్పుకున్నారు. కానీ.. మంత్రివర్గంలో ఆయన పేరు లేదు. అదే సమయంలో తనకే మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ వినోద్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఢిల్లీకి వెళ్లి కలిసి వచ్చారు. దీంతో ఇద్దరు అన్నదమ్ములు అమాత్య పదవి కోసం పోటీ పడడం కనిపిస్తోంది. ఈ ఇద్దరన్నదమ్ముల్లో ఎవరిని పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటుందోనని కేడర్‌లో చర్చ జరుగుతోంది.

'పీఎస్సార్'కు ఖర్గే హామీ !

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) మంత్రి పదవి రేసులో ప్రముఖంగా ఉన్నారు. గత ఏప్రిల్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా మంచిర్యాలలో ఏర్పాటు చేసిన 'సత్యాగ్రహ' సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పీఎస్సార్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, కీలక హోదాలో ఉంటారని హామీ ఇచ్చారు. అయితే తొలివిడతలో ఆయనకు అవకాశం రాలేదు. మరోవైపు మంత్రి పదవులు వరించిన వారి సామాజిక వర్గాలు చూస్తే, వెలమ కోటలో ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి జూపల్లి క్రిష్ణారావుకు చోటు దక్కింది. ఇక ఎస్సీ కోటాలో భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి, దామోదర రాజనర్సింహా ఉన్నారు. ఈ క్రమంలో మిగిలిన ఆరు మంత్రి పదవుల్లో భర్తీ చేయాల్సి వస్తే, సామాజిక సమీకరణాలు కీలకంగా మారాయి. పోటీలో ఉన్న వారి సామాజిక కోటా పరిగణనలోకి తీసుకుంటే, ఎవరి అవకాశాలను దెబ్బతీస్తుందోనని ఉత్కంఠ నెలకొంది. కేబినేట్ స్థాయి పదవులతో సమానంగా ఉండే డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌తో పదవి దక్కని వారు నిరాశ పడకుండా సర్దుబాటు చేస్తారనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తదుపరి టీంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు ఉంటుందో, ఎవరికి నిరాశ కలుగుతుందోనని అధికార పార్టీ వర్గాల్లోనూ, ఇటు ఉమ్మడి జిల్లా ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. ఎవరికి వారు ఇటు రాష్ట్ర పెద్దలతోపాటు అటు ఢిల్లీలోని పార్టీ పెద్దలను కలుస్తూ మంత్రి పదవి కోసం తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి సంకల్ప్‌యాత్ర



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి జిల్లాలో ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్‌యాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి సంకల్ప్‌యాత్ర నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ చేపట్టిన పథకాలపై జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, పథకాలపై అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రోజుకు రెండు గ్రామ పంచాయతీల చొప్పున జనవరి 26వరకు గ్రామాల్లో అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

బెల్లంపల్లిలో ఆగిన వందే భారత్ రైలు



ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌కు వెళ్తున్న రైలు

బెల్లంపల్లి: రైల్వేశాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వందే భారత్ రైలు శుక్రవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగింది. కాజీపేట్–నాగ్‌పూర్ మార్గంలో వందేభారత్ రైలు ప్రయాణించడం రైల్వే ప్రయాణికులను ఆకర్శించింది. రైలు న్యూఢిల్లీకి వెళ్తూ బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచారు. పచ్చజెండా ఊపిన తర్వాతే రైలు పరుగులు తీసింది. కొత్తగా తయారు చేసిన రైలును ఢిల్లీకి తీసుకెళ్తూ ఇక్కడ ఆపడంతో అందరి దృష్టి అటువైపు మళ్లింది. రైలు చెన్నయ్ నుంచి ఢిల్లీకి వెళ్తున్నట్లు రైల్వే అధికారి తెలిపారు. నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు నడపడానికి ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు.

హత్యాయత్నంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శేజల్

బెల్లంపల్లి: తనపై భౌతిక దాడి చేసి హత్యాయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆరిజిన్ డెయిరీ సీఏఓ బోడపాటి శేజల్ పోలీసులను కోరారు. శుక్రవారం బెల్లంపల్లి వన్‌టౌన్‌లో ఐదుగురిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసుస్టేషన్ ఎదుట ఆమె విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ ఒకటిన బెల్లంపల్లికి వచ్చిన తనపై మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనుచరులు సన్నీబాబు, కొత్తపల్లి రాజ్‌కుమార్, శ్యామ్‌కుమార్, క్యాటరింగ్ అలీ, గోలి శివ, కుంబాల రాజేశ్ దాడి చేశారని తెలిపారు. ఆ ఘటనపై ఆ రోజే పోలీసులకు ఫిర్యాదు చేసినా శ్రద్ధ వహించలేదని, కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య అనుచరులతో తనకు ప్రాణహానీ ఉందని పేర్కొన్నారు. ఆమె వెంట ఆరిజిన్ డెయిరీ సీఈవో ఆదినారాయణ ఉన్నారు.

రాష్ట్ర కాంటింజెంట్ లీడర్‌గా షరీనాబేగం

మంచిర్యాలఅర్బన్: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సేవా పథకం వాలంటీర్స్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు తెలంగాణ రాష్ట్ర కాంటింజెంట్ లీడర్‌గా మంచిర్యాల వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనా బేగం ఎంపికయ్యారు. తెలంగాణలో వివిధ యూనివర్సిటీలకు చెందిన 20 మంది వాలంటరీలు ఎంపిక కాగా కాంటింజెంట్ లీడర్‌గా షరీనా బేగంను నియమించారు. ఈ నెల 23నుంచి జనవరి 1వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాల అటల్ బీహరీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్, అలైడ్ స్పోర్ట్స్ నిర్వహించే 10 రోజుల క్యాంపునకు హాజరు కానున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి వాలంటరీలుగా వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని స్రవంతి ఎంపికయ్యారు. లీడర్‌గా ఎంపిక చేసిన కాకతీయ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ ఈసం నారాయణ, జిల్లా కన్వీనర్ చంద్రమోహన్‌లకు షరీనాబేగం కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి పథకాలు



మాట్లాడుతున్న రాహుల్

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్‌హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తోందని అన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని, ఇప్పటికే కొందరు వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయిలో నిలిచి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా వారు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దివ్యాంగ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ, నాయకులు మహేందర్, తిరుపతి, సతీశ్, భాగ్య పాల్గొన్నారు.

'మధ్యాహ్నం' అప్పులపాలు..!

"పప్పులు, ఉప్పుల ధరలు పెరిగిపాయే. మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసేటట్లు లేకపోయే. వచ్చే జీతం తక్కువ. అప్పోసప్పో చేసి వంట చేయడం తప్పదు కదా. నెలలు గడుస్తున్నా బిల్లులు రావాయే. ఐదు రూపాయల చొప్పున వడ్డీకి తెచ్చినా వచ్చే బిల్లులు సకాలంలో రాకపోవడం.. అప్పులు ఇచ్చినోళ్లు ఆగుతలేరాయే. ఏం చేద్దాం.." ఇదీ ఓ వంట ఏజెన్సీ నిర్వాహకురాలి ఆవేదన.



జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- సకాలంలో అందని భోజన బిల్లులు
- నిర్వాహకులకు తప్పని కష్టాలు
- గౌరవ వేతనమూ ఆలస్యమే..

మంచిర్యాలఅర్బన్: నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటున్నాయి. నెలల తరబడి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉపాధ్యాయుల నుంచి వచ్చే ఒత్తిడి మేరకు అప్పు తెచ్చి మరీ నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా పేద, నిరుపేద విద్యార్థులే చదువుతున్నారు. వారికి ఉచిత భోజనం, పుస్తకాలు, సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిధులు ఖర్చు చేస్తున్నాయి. మధ్యాహ్న భోజనం కోసం ఇదివరకు లాగా దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. నిధులు సకాలంలో రాక నిర్వాహకులు చేతులెత్తేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో మార్చి నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉండగా మరికొన్ని మండలాల్లో ఎగ్ బిల్లులు, వంట కార్మికులకు రెండు నెలలుగా పెండింగ్ బిల్లులు ఉన్నాయి. కొన్ని మండలాల్లో పెంచిన రూ.2వేలు కూడా మార్చి నెల నుంచి అందకుండా పోతోంది.

జిల్లాలో అమలు ఇలా..

జిల్లాలో 752 పాఠశాలల్లో 62,471 మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలవుతోంది. 1279 మంది మధ్యాహ్న భోజనం నిర్వాహకులు(కుక్ కం హెల్పర్లు) పని చేస్తున్నారు. ఉన్నత పాఠశాలకు చెందిన(తొమ్మిది, పది తరగతులు) ఒక్కో విద్యార్థికి బియ్యం 150గ్రాములు, వంటకానికి రూ.10.67 పైసలు ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులోనే కోడిగుడ్డు(ప్రత్యేకంగా గుడ్డు ధర ఉండదు) సమకూర్చాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థికి 100గ్రాముల బియ్యంతోపాటు కోడిగుడ్డుకు రూ.5, వంటకానికి రూ.8.57 చెల్లిస్తోంది. ప్రాథమిక పాఠశాలలో ప్రతీ విద్యార్థికి వంటకానికి రూ.5.47 చెల్లిస్తున్నారు. వారంలో మూడు రోజులు కోడిగుడ్డును ప్రతీ విద్యార్థికి అందజేయాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనం నిధులు పెంచాలని వంట ఏజెన్సీలు ఎప్పటి నుంచో కోరుతుండగా ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా బిల్లులు రాక ఇబ్బందులు తప్పడం లేదు.

పెండింగ్‌లో..

నిధులు సకాలంలో రాకపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. నిధులు మంజూరవుతున్న ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాలో రూ.42.87లక్షలు కోడిగుడ్డు, వంటకాలు కుకింగ్ కాస్ట్‌కు సంబంధించిన నిధులు నెలలు గడుస్తున్నా రాకుండా పోయాయి. ఇందులో మంచిర్యాల, హాజీపూర్, నస్పూర్ మండలాల్లో అధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. రూ.26,84,277కు పైగా నిధులు రావాల్సి ఉంది. తొమ్మిది, పదో తరగతికి సంబంధించి మార్చి బిల్లులు రావాల్సి ఉంది. ఎగ్‌కాస్ట్ బిల్లులు ఏప్రిల్ నెల నుంచి విడుదల కావాల్సి ఉంది. కుక్ కం వెల్ఫేర్‌కు చెల్లించే డబ్బులు మంజూరు కానట్లు తెలుస్తోంది. నిధులు మంజూరు కాగా అప్పులు తెచ్చి వంటలు చేయాల్సిన పరిస్థితి. అసలే అంతంత వేతనాలకు తోడు నిధులు ఆలస్యం మధ్యాహ్న భోజనం నిర్వాహకులను కష్టాల్లోకి నెడుతోంది. ఎప్పటికప్పుడు నిధులు మంజూరవుతున్నా ఈ–కుబేర్‌లోనే పెండింగ్‌లో ఉండడంతో వంటకార్మికులకు సకాలంలో అందకుండా పోతున్నాయి.

ముద్దవుతున్న అన్నం..



మధ్యాహ్న భోజనం పథకంపై విద్యార్థులు పెదవి విరుస్తున్నారు. కొత్త బియ్యం సరఫరా చేయడం వల్ల అన్నం వండిన తర్వాత చూస్తే ముద్దగా మారుతోంది. దీంతో వడ్డించిన అన్నాన్ని తినేందుకు ఇష్టపడడం లేదు. గత కొద్ది రోజులుగా ముద్దగా మారే బియ్యం పాఠశాలలకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. సన్నబియ్యం మాటేలా ఉన్నా ముద్ద బియ్యం చూస్తే విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో అందేలా చర్యలు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం. ఏయే మండలాల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయో.. ఎందుకు జాప్యం జరుగుతుందో అందుకు సంబంధించిన వివరాలు సేకరించి నివేదించాం. నిధులు మంజూరవుతున్న ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వంటకార్మికుల పెండింగ్ బిల్లులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం.

– డీఈవో యాదయ్య, మంచిర్యాల

న్యూట్రీషన్ కిట్లపై అప్రమత్తం

- పురుగులు వస్తున్నట్లు గుర్తించిన ప్రభుత్వం
- పరిశీలించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ



ఎంసీహెచ్‌లో కిట్లను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లలో లయన్‌డేట్స్‌తోపాటు ఇతర తినే ఆహార పదార్థాల్లో కొన్నింటికి పురుగులు పడుతున్నట్లు వస్తున్న సమాచారంతో ప్రభుత్వం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది. జిల్లాకు సరఫరా చేసిన కిట్లలో ప్రతీ వస్తువును పరిశీలించిన తర్వాత గర్భిణులకు ఇవ్వాలని అధికారులకు సూచించింది. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిట్లను తెరిచి అందులోని ప్రతీ వస్తువును పరిశీలిస్తున్నారు. ఎక్కువగా లయన్‌డేట్స్ ప్యాకెట్ల రూపంలో అందిన వాటిలోనే పురుగులు వస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు ఫిర్యాదులు వెళ్తున్నట్లు సమాచారం. ఎక్కువగా ప్రసవాలు జరిగే మాతాశిశు ఆరోగ్యకేంద్రం, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో న్యూట్రీషన్ కిట్లను ఎప్పటికప్పుడు గర్భిణులకు అందిస్తుండగా..ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుల తరబడి ఉంచడం వల్లే పురుగు పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

జిల్లాకు 6,900 కిట్లు

గర్భిణుల్లో పౌష్టికాహార లోపం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రసవం వరకు రెండుసార్లు న్యూట్రీషన్ కిట్లను అందిస్తోంది. గర్భిణుల్లో రక్తహీనత నివారణ ద్వారా మాతాశిశు మరణాల శాతాన్ని పూర్తిగా తగ్గించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ఈ కిట్ల పంపిణీని ఈ ఏడాది మేలో ప్రారంభించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షల కోసం పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు 12 నుంచి 26వారాల్లోపు అందజేస్తారు. రెండో కిట్‌ను 24నుంచి 34 వారాల్లోపు పరీక్షలకు వెళ్లినప్పుడు అందజేస్తారు. మొదటి కిట్‌లో మదర్ హార్లిక్స్, ఖర్జూరా ప్యాకెట్, ఐరన్ సిరప్ బాటిళ్లు, నెయ్యి, పల్లిపట్టి ప్యాకెట్లు, ఒక కప్పు బాస్కెట్‌లో అందిస్తుండగా, రెండో కిట్‌లో బాస్కెట్‌కు బదులుగా బ్యాగులో వాటినే అందిస్తున్నారు. రక్తహీనత నివారణకు అందిస్తున్న లయన్‌డేట్స్, పల్లిపట్టీలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచినప్పుడు కొన్ని పురుగు పడుతున్నట్లు గుర్తించారు. కాగా, జిల్లాకు 6,900 కిట్లను ప్రభుత్వం సరఫరా చేయగా, ఇప్పటి వరకు 5,718 మందికి అందజేశారు. జిల్లాకు సరఫరా చేసిన న్యూట్రీషన్ కిట్లలో ఎలాంటి సమస్య లేదని, ఎక్కువ రోజులు నిల్వ ఉండే కిట్లపైన దృష్టి సారించాలని జిల్లా ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నీరజ తెలిపారు.

మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లపై అవిశ్వాస నోటీసు



కలెక్టర్‌కు నోటీసు అందిస్తున్న కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ ఛైర్మన్ పెంట రాజయ్య, వైస్ ఛైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ 26 మంది కౌన్సిలర్లు శుక్రవారం కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేశారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్ మాట్లాడుతూ అవిశ్వాసానికి అవసరమైన కౌన్సిలర్ల సంఖ్యాబలం తమకు ఉందని, ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం కోసం సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గెలుపొందడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన 17 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందని నమ్మి స్వచ్ఛందంగా వచ్చినట్లుగా తెలిపారు. కాగా, నోటీసు ఇచ్చిన అనంతరం 26 మంది కౌన్సిలర్లను హైదరాబాద్‌లో క్యాంప్ కోసం ప్రత్యేక బస్సులో తరలించారు.

న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

నస్పూర్: నిరుపేద దళితులమైన తమకు న్యాయం చేయాలని పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు సర్వే నంబరు 42 భూ బాధితులు వేడుకున్నారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నస్పూర్ శివారు సర్వే నంబరు 42లో ప్రభుత్వం 1950లో అసైన్డ్ చేసిందని అన్నారు. తాము కొన్నేళ్లు వ్యవసాయం చేయకపోవడంతో ప్రభుత్వం ఆ భూమిని 2010లో టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిందని పేర్కొన్నారు. భూమి ఇప్పించాలని హైకోర్టులో కేసు వేయగా.. కొంత భూమి కేటాయిస్తామని టీఎన్జీఓస్ నాయకులు చెప్పడంతో వాపస్ తీసుకున్నామని తెలిపారు. తమకు కేటాయించిన రెండెకరాల్లో మున్సిపల్, ఉన్నతాధికారుల అనుమతికి దరఖాస్తు చేసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం అధికారులు ఇళ్ల నిర్మాణాలను కూల్చి వేశారని, టీఎన్జీఓస్ సొసైటీ పేరిట అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో బాధితులు మాడుగుల కిరణ్, సురిమిల్ల శ్రీనివాస్, కొయ్యల రమేశ్, కొయ్యల రాజు, కైలి కుమార్ పాల్గొన్నారు.

అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

బెల్లంపల్లి: రైతులు పంటల సాగుపైనే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈఈఐ, డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రైతులు, మహిళలకు చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో చేపట్టిన ఐదు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. మంచిర్యాల, కుమురంభీమ్ జిల్లాల ఔత్సాహికులు హాజరయ్యారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న రైతులు, మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చేపలు, రొయ్యల పచ్చడి తయారీ చేసి అమ్మకాలు సాగిస్తే ఆదాయాన్ని పెంచుకోవచ్చని అన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కుమురంభీమ్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష, కేవీకే శాస్త్రవేత్తలు ప్రియసుగంధి, నాగరాజు, సతీష్, తిర్యాణి మండల వ్యవసాయ అధికారి తిరుమలేష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ఎస్ఈకి అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్‌రావు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లోని సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) ప్రభాకర్‌రావు కోల్ ప్రొడక్టివిటీ అవార్డు అందుకున్నారు. శుక్రవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీర్ ఆధ్వర్యంలో బెంగళూర్‌లోని బీఎంఎస్ యూనివర్సిటీలో నిర్వహించిన 67వ జాతీయ కన్వెన్షన్, 7వ అంతర్జాతీయ ప్రొడక్టివిటీ అవార్డు ప్రదానం చేశారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అరవింద్ జాదవ్ అవార్డు అందజేశారు. ఎస్టీపీపీ మానవ వనరుల సద్వినియోగం, ఇన్‌సెంటీవ్ స్కీం అమలు, మెరుగైన ఉత్పత్తి సాధింపు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, వివిధ ప్రణాళికల అమలులో ప్రభాకర్‌రావు ప్రతిభ కనబరిచారు.

'షాదీఖానా భూమి అమ్మకానికి కుట్ర'

బెల్లంపల్లి: మున్సిపాల్టీలోని షంషీర్‌నగర్ బస్తీలో ఉన్న షాదీఖానా భూమిని కొందరు గట్టుగా అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోందని బెల్లంపల్లి మున్సిపల్ ముస్లిం నాయకులు అమానుల్లాఖాన్, అన్వర్‌ఖాన్, ఎండి.గౌస్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రెండెకరాల భూమిని టీడీపీ హయాంలో కేటాయించారని తెలిపారు. షాదీఖానా నిర్మాణానికి రూ.7.5 లక్షలు మంజూరు కాగా కొంత వరకు నిర్మాణ పనులు జరిగాయని తెలిపారు. ఖాళీగా ఉన్న భూమిని కొందరు కుట్రపన్ని తప్పుడు పత్రాలతో రూ.1.25 కోట్లకు అమ్మకానికి సిద్ధపడినట్లు సమాచారం ఉందని తెలిపారు. ఆ భూమిని ఎవరూ కొనుగోలు చేయవద్దని అన్నారు. ఈ సమావేశంలో ముస్లిం నాయకులు జావీద్‌ఖాన్, ఆసిఫ్, జమీర్‌ఖాన్, రంజాన్ అలీ, ఫిరోజ్‌ఖాన్, షదాబ్, సాధిక్, యాకూబ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల ఇన్‌చార్జిగా కాంపల్లి సమ్మయ్య

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఐఎన్టీయూసీ ఎన్నికల ఇన్‌చార్జిగా ఆ యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్యను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల్లో శ్రీరాంపూర్ అధిక మెజారిటీ రావాలని, నాయకులను సమన్వయం చేస్తూ పని చేయాలని సమ్మయ్యకు సూచించారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

బెల్లంపల్లి: ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ బెల్లంపల్లి జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జే.ముఖేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి షీర్ నగర్ బస్తీకి చెందిన సామల రాజ్‌కుమార్ ఇంట్లో సెప్టెంబర్ 2న అదే బస్తీకి చెందిన మురుకుట్ల కిరణ్ చోరీకి పాల్పడ్డాడు. బీరువాలోని రూ.32 వేల నగదు దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కిరణ్‌ను కోర్టులో హాజరుపర్చగా సాక్షులను విచారించిన జడ్జి నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆత్మహత్య కేసులో నలుగురి రిమాండ్

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన ఆదె గోపాల్ ఆత్మహత్యకు కారకులైన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఈ నెల 10న జరిగిన ఈ ఘటనలో మృతుడి తండ్రి ఆదె శంకర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి మృతుడి మామ మొహర్లే బడిరాం, బావమరుదులు మొహర్లే జ్ఞానేశ్వర్, మొహర్లే కిషన్, భార్య ఆదె జనాబాయిలను సిర్పూర్–టీ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు. శుక్రవారం వారిని జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

క్యాంపు కార్యాలయం పరిశీలన

- చోరీకి గురికాలేదని నిర్ధారించిన అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని కొన్ని వస్తువులను బయటకు తీసుకెళ్లినట్లు 'సాక్షి'లో వచ్చిన కథనానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఏఈఈ అనూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ మంచిర్యాల క్యాంపు కార్యాలయానికి వెళ్లి గతంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, కుర్చీలు, బెడ్‌లు, ఏసీలను పరిశీలించారు. అందులో ఏ ఒక్కటి కూడా బయటకు వెళ్లలేదని ఏఈఈ తెలిపారు. అవసరాన్ని బట్టి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన స్వంత డబ్బులతో కొనుగోలు చేసిన టీవీ, ఫ్రిజ్, కుర్చీలు, వంటసామగ్రి మాత్రమే బయటకు తీసుకెళ్లారని, ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక్క వస్తువు బయటకు వెళ్లలేదని విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ తాము కొనుగోలు చేసిన వస్తువులను మాత్రమే తీసుకెళ్లామని, ప్రభుత్వం సమకూర్చిన వస్తువులను ముట్టుకోలేదని స్పష్టం చేశారు.

సింగరేణి డే వేడుకలు

శ్రీరాంపూర్: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న సింగరేణి వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుమాధవ్, నాయకులు భీరయ్య, బంగారి రాజయ్య, నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిపై మమకారంతో హైదరాబాద్ ప్రాంతంలో నివాసముంటున్న వారి కోసం తాము ఈ వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. హైదరాబాద్ పట్టణంలోని నాగోల్‌లోని లలితా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతంలో ఉండే విశ్రాంతి ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

- వేతనం కోసం విలీన వీఆర్‌ఏల తండ్లాట
- ఆరు నెలలుగా అందని జీతాలు


సమ్మెలో పాల్గొన్న వీఆర్‌ఏలు(ఫైల్)

కోటపల్లి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్యలో అనుసంధానంగా వ్యవహరించిన వీఆర్‌ఏలను పదోన్నతుల ద్వారా ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే అప్పటి నుంచి వీరికి జీతాలు చెల్లించడంలేదు. దీంతో వారు అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన నిర్లక్ష్యానికి గురైన వీఆర్‌ఏలు చాలా తక్కువ వేతనం నుంచి పనిచేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపాయే నాటికి రూ.6వేల వేతనం అందుకుంటున్నారు. తమ బతుకులు మార్చాలని అనేక పోరాటాలు చేసిన వీఆర్‌ఏలకు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వేతనాన్ని రూ.10,500వేలకు పెంచింది. 2016, 2020 సంవత్సరాల్లో ఆసెంబ్లీలో అప్పటి సీఎం వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పిస్తామని, వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చాడు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టంతో ప్రమోషన్ ఇచ్చేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో గత ఏడాది వీఆర్‌ఏలు సమ్మెబాట పట్టి 86 రోజులు విధులకు దూరంగా ఉన్నారు. సమ్మె విరమించి చర్చలకు వస్తేనే వీఆర్‌ఏల గురించి ఆలోచించిస్తామని గత ప్రభుత్వం తెలుపడంతో చర్చలకు వెళ్లారు. వీఆర్‌ఏల ప్రతినిధులతో చర్చలు జరిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో నంబర్ 81 ప్రకారం వారిని మున్సిపాలిటీ, ఇరిగేషన్, మిషన్‌భగీరథ, రెవెన్యూ ఇలా వివిధ శాఖల్లో పదోన్నతులపై నియమిస్తూ 10.08.2023న వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేసింది. అప్పటి వరకు రూ.10,500 వేతనం అందుకున్న వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో పదోన్నతులపై సర్దుబాటు చేసింది. అయితే వారికి నేటికి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వీఆర్‌ఏలు....	
ఆదిలాబాద్	327
నిర్మల్	728
మంచిర్యాల	523
కొమురంభీం	374
మొత్తం	1925

ఉమ్మడి జిల్లాలో 1925 మంది...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1925 మంది వీఆర్‌ఏలను పదోన్నతులు ఇచ్చి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో సర్దుబాటు చేయగా కొందరిని ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాకు పంపించారు. వీరిలో 10వ తరగతి వరకు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్‌గా, డిగ్రీ పూర్తి చేసిన వారిని జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. అప్పటి నుంచి ఆయా శాఖల్లో పనిచేస్తున్న వీరు తాత్కాలిక రిజిస్టర్‌లోనే ప్రతిరోజు సంతకాలు చేస్తున్నారు. జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం...

నేను ప్రస్తుతం మున్సిపాలిటీ వార్డు అధికారిగా పనిచేస్తున్నాను. పదోన్నతిపై మున్సిపాలిటీ వార్డు అధికారిగా విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు జీతం రాలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాను. కుటుంబాన్ని పోషించడానికి అప్పులు చేయాల్సి వస్తుంది.

– దుర్గం శ్రీనివాస్, వార్డు అధికారి

ఇల్లు గడవడం కష్టంగా ఉంది...

నాలుగు నెలలుగా జీతం రాకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉంది. విధుల్లో చేరిన నుంచి ప్రతిరోజు విధుల నిర్వహణకు వస్తున్నాం. ప్రభుత్వం మాపై దయ చూపి గుర్తింపు కార్డులు అందజేసి జీతాలు చెల్లించాలి.

– సుధాకర్, మిషన్‌భగీరథ హెల్పర్

సర్కారు బడుల్లో సౌర వెలుగులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల్లో సోలార్ వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెరుగుతున్న విద్యుత్ భారం తగ్గించేందుకు సౌర వెలుగులకు విద్యాశాఖ, టీఎస్ రెడ్‌కో ఈ పథకం అమలుకు నిర్ణయించాయి. స్కూల్ గ్రాంటులో అత్యధికంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులకే సరిపోతుంది. విద్యుత్ ఖర్చులు తగ్గింపు ఇతర పరిస్థితుల నేపథ్యంలో 133 పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలలో క్షేత్రస్థాయి టీఎస్ రెడ్‌కో ప్రతినిధి బృందం పరిశీలన అనంతరం ఎంత మేర సోలార్ పలకలు అవసరం ఉన్నాయో గుర్తించనున్నారు. ఆయా పాఠశాలల్లో సోలార్ సిస్టం అమర్చడంతో సౌర వెలుగులు రానున్నాయి.

విద్యుత్ ఖర్చులు అధికంతో..

ఎంపిక చేసిన 133 పాఠశాలలకు సోలార్ వెలుగులు రానున్నాయి. సోలార్ పలకలు ఏర్పాటు చేయనున్నారు. కంప్యూటర్లు, ఫ్యాన్లు, బల్బులు, బోరు మోటర్ నడవడానికి అధికంగా విద్యుత్ వినియోగిస్తుంటారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే సోలార్ విద్యుత్ పలకలతో రెండు కిలో వాట్స్ నుంచి 10 కిలోవాట్స్ వరకు విద్యుత్ ఉత్పత్తి కానుంది. కిలోవాట్స్‌లను బట్టి రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు వ్యయం చేయనున్నారు. బ్యాటరీ ఇన్వర్టర్ల ద్వారా సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసుకొని పాఠశాలల్లో అవసరం మేరకు వినియోగిస్తారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

జిల్లాలో ఎంపిక చేసిన వాటిలో ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, రెసిడెన్సీ పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలల్లో 2కిలోవాట్స్, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలో 5కిలోవాట్స్, రెసిడెన్సీ, కేజీబీవీలో 10 కిలోవాట్స్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కసరత్తు చేస్తున్నారు. బెల్లంపల్లి మండలంలో 10, భీమినిలో 6, భీమారంలో 1, చెన్నూర్‌లో 9, దండేపల్లిలో 8, హాజీపూర్‌లో 6, జైపూర్‌లో 8, జన్నారంలో 14, కన్నెపల్లిలో 6, కాసిపేటలో 8, కోటపల్లిలో 7, లక్సెట్టిపేటలో 12, మంచిర్యాలలో 11, మందమర్రిలో 10, నస్పూర్‌లో 5, నెన్నెలలో 3, తాండూర్‌లో 6, వేమనపల్లి మండలంలో 3 పాఠశాలలు ఎంపిక చేశారు.

విద్యాలయాల్లో సోలార్ ఏర్పాటు

సర్కారు పాఠశాలల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తొలి విడతలో పాఠశాలలు ఎంపిక చేశాం. త్వరలోనే సోలార్ విద్యుత్ వ్యవస్థ పాఠశాలల్లో అమల్లోకి రానుంది.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

కలెక్టరేట్‌లో ఉద్యోగాల పేరిట మోసం

- సీసీసీ నస్పూర్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకుడిపై కేసు


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకుని ఉద్యోగంలో చేర్పించుకుని తీరా జీతాలు ఇవ్వకుండా మోసం చేసిన ఏజెన్సీ నిర్వాహకులపై సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. శుక్రవారం సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ వివరాలు వెల్లడించాడు. సమీకృత కలెక్టరేట్ భవన్‌లో అక్షర ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో స్వీపర్, గార్డెన్ మేయింటనెన్స్, సెక్యూరిటీ గార్డులుగా సుమారు 37మందిని మూడు నెలల క్రితం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక్కొక్కరి వద్ద రూ.50వేలు నుంచి రూ.2లక్షలు వరకు వసూలు చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సదరు ఉద్యోగులు ఏజెన్సీ నిర్వాహకులను నిలదీశారు. జీతాలు ఇవ్వడం ఆలస్యం అవుతుందని, పదేపదే జీతాలు అడిగితే మిమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించి కొత్త వారిని తీసుకుంటామని బెదిరించారు. దీంతో సూపర్‌వైజర్ రాకేశ్ గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఏజెన్సీ నిర్వాహకుడు గుర్రం శ్రీనివాస్, అతడికి సహకరించిన వినోద్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన....

సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో మూడు నెలలు పనులు చేయించుకుని జీతాలు ఇవ్వకపోవడంపై అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం రాత్రి కలెక్టరేట్ భవనం ఎదుట నిరసన చేపట్టారు. స్థానిక పోలీసులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి వారిని అక్కడి నుండి పంపించారు. ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీనివాస్ గురువారం సాయంత్రం కలెక్టరేట్ వద్దకు రాగా బాధితులు అతడితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకుడు అసభ్య పదజాలంతో మాట్లాడుతూ మీరు ఎవరికైనా చెప్పుకోండి తనను ఎవరూ ఏమి చేయలేరని బెదిరించాడు. దీంతో బాధితులు కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారి చాంబర్ ఎదుట వాగ్వాదానికి దిగడం కొసమెరుపు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలిండియా ఓవరాల్ చాంపియన్ 'సింగరేణి'



ఓవరాల్‌చాంపియన్ జట్టు సింగరేణి బీ టీం

- రెండోస్థానంలో డబ్ల్యూసీఎల్
- మెటల్ మైన్స్ చాంపియన్‌గా హెచ్‌జెడ్‌ఎల్ మహిళా జట్టు
- ముగిసిన ఆలిండియా స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు

గోదావరిఖని: 52వ ఆలిండియా రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా సింగరేణి బీ–టీం నిలించింది. ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు రామగుండం మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న 10 కోల్‌మైన్స్, ఆరు మెటల్ మైన్స్‌లకు చెందిన 25 జట్లు పాల్గొన్నాయి. అన్ని విభాగాల్లో ఆయా రాష్ట్రాలకు చెందిన జట్లు తమ సత్తా చాటాయి. ఓవరాల్ రెండోస్థానంలో వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్(డబ్ల్యూసీఎల్), ఓవరాల్ మూడోస్థానంలో సీసీఎల్ జట్టు నిలిచింది. అలాగే మెటల్ మైన్స్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా హిందూస్థాన్ జింక్(హెచ్‌జెడ్‌ఎల్)మహిళా జట్టు నిలిచింది. రెండోస్థానంలో మ్యాంగనీస్ ఓర్‌ఇండియా లిమిటెడ్, మూడోస్థానంలో హిందూస్థాన్ జింక్ బీ – టీం నిలిచింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు షీల్డులు అందజేశారు.

వాహనాల వేలం

చెన్నూర్: చెన్నూర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 11 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మోటార్ సైకిళ్లను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. వేలంపాటలో ఒక మోటార్ సైకిల్ నడిచే సామర్థ్యం ఉండగా మరో ఏడు స్క్రాప్ క్రింద వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

యువజనోత్సవాలకు సన్నద్ధం

- 21న జిల్లా స్థాయి పోటీలు
- సామూహిక, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ యువజనోత్సవాలు నిర్వహించేందుకు జిల్లా యువజన, క్రీడల శాఖ సన్నద్ధమవుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 21న ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. యువజనోత్సవాల్లో పాల్గొనే కళాకారులు 15 నుంచి 29ఏళ్ల వయస్సులోపు ఉండాలి. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

సామూహిక ప్రదర్శనలు..

జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ గ్రూప్), ఒక్కో బృందంలో 10 మంది ఉండాలి. జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయలకు అనుగుణంగా ప్రదర్శనలుండాలి. జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ సోలో) ఐదుగురు మాత్రమే ఉండాలి. జానపద గేయాలు (ఫోక్ సాంగ్ గ్రూపు) ఒక్కో బృందంలో 10 మంది వరకు పాల్గొనవచ్చు. జానపద గేయం (ఫోక్ సాంగ్ సోలో) ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులు ఉండాలి.

వ్యక్తిగత ప్రదర్శనలు..

వ్యాసరచన పోటీలు ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లంలో 60 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఎంపిక చేసిన అంశం మార్చేందుకు వీలుండదు. పోస్టర్ మేకింగ్ చేసేందుకు 90నిమిషాల సమయం ఇస్తారు. ఏ–3 సైజు పేపర్ వినియోగించాల్సి ఉంటుంది. ఫొటోగ్రఫీలో పాల్గొనే వారందరూ రెండు ఫొటోగ్రాఫ్స్ మొబైల్, కెమెరాతో పాటు ప్రింట్లు తీసుకురావాలి. ఫొటో 1 ఎంబీకి తక్కువ కాకుండా 2ఎంబీకి ఎక్కువ కాకుండా చూడాలి. ప్రగతిశీల్ భారత్ ఆత్మ నిర్భర్ భారత్, యోగా, క్రీడలు శారీరక శ్రమ ప్రకృతి దృశ్యం వంటి అంశాలలో ఫొటోగ్రఫీ పోటీలుంటాయి. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరీలో గరిష్టంగా ఇద్దరిని ఎంపిక చేస్తారు.

20లోపు వివరాలు అందజేయాలి

యువజనోత్సవాల్లో పాల్గొనాలకునే వారు ఈనెల 20లోగా వివరాలు అందజేయాలి. పేరు, పుట్టినతేది, వయస్సు, ఆధార్‌కార్డు, అడ్రస్‌తో పాటు సంబంధిత వివరాలతో కూడిన బయోడేటాను డీవైఎస్‌వో కార్యాలయంలో అందజేయాలి. పూర్తి వివరాలకు 9346655441 నంబర్‌లో సంప్రదించాలి.

– బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి

సమస్యలపై ప్రశ్నించే సంఘాన్నే గెలిపించండి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని ప్రశ్నించే సంఘాన్నే గుర్తింపు ఎన్నికలలో గెలిపించాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. గతంలో గుర్తింపు సంఘాలుగా పనిచేసిన యూనియన్లు కార్మికుల సమస్యలను పక్కనబెట్టి వ్యక్తిగత లాభాలకోసం పనిచేశాయన్నారు. నూతనంగా ఏర్పడిన క్యాతనపల్లి మున్సిపాలిటీలో కార్మికులకు ఇంటి కిరాయి రాకుండా ఆర్థికంగా నష్టం చేకూర్చాయన్నారు. కార్మికుల పక్షాన నిలబడే సీఐటీయూకి ఎన్నికల్లో అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ ఐలయ్య, సంజీవ్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఒప్పందాలు చేస్తాం

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో తాము గెలిస్తే కొన్ని డిమాండ్లపై శాశ్వత ఒప్పందాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్లకు మెడికల్ అన్‌ఫిట్ అయితే వన్ టైం సెటిల్‌మెంట్ కింద సూటబుల్ జాబ్ ఇస్తున్నారని, దీనికి శాశ్వతంగా ఒప్పందం చేయిస్తామన్నారు. అంతేకాకుండా క్యాడర్స్ మెరుగుపరుస్తామని తెలిపారు. ఇన్నాళ్లు కంపెనీలో స్ట్రక్చరల్ సమావేశాలు కూడా సరిగా నిర్వహించలేదని, అధికారంలోకి వస్తే విధిగా సమావేశాలను నిర్వహిస్తామన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. పలువురు కార్మికులు ఈ సందర్భంగా యూనియన్‌లో చేరగా వారికి రాజారెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్, శ్రీధర్, నరేష్ ప్రవీణ్ సమ్మయ్య పాల్గొన్నారు.

ఒప్పందాలు అమలు చేయిస్తాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: తాము గెలిస్తే కోలిండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయిస్తామని బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శుక్రవారం ఎస్సార్పీ 1గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోలిండియాలో జరిగిన చాలా ఒప్పందాలను సింగరేణిలో గెలిచిన సంఘాలు అమలు చేయించడం లేదన్నారు. సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బాకాయలను వెంటనే వసూలు చేయిస్తామన్నారు. కొత్తగా భూగర్భగనులను తీసుకువచ్చి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాగడ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు రాజు యాదవ్, పురుషోత్తమ చారి, వసంతరావు, రాజ్ కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కులు

- ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు


మాట్లాడుతున్న వైవీ రావు

శ్రీరాంపూర్: పోరాటాలతోనే కార్మికులకు హక్కుల సిద్ధిస్తాయని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీరావు తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీ, ఎస్సార్పీ 3,3ఏ గనులపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా కార్మికుల సమస్యలను గెలిచిన సంఘాలు పట్టించుకోలేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ ఆర్థికంగా దివాళా తీసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో తామిస్తున్నా హామీలన్నింటిని గెలిచిన తరువాత నెరవేరుస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. సమావేశాల్లో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, కె. వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, ఫిట్స్ సెక్రటరీలు మురళి చౌదరి, మోహన్ రెడ్డి, నాయకులు గండి సతీష్, అఫ్రోజ్ ఖాన్, గొల్లపల్లి రాంచందర్, తౌటం మల్లేష్, అంబాల రవి పాల్గొన్నారు.

'ఏ సంఘంలో తిరిగినా టీబీజీకేఎస్‌కు ఓటేయండి'


మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు సంపత్

మందమర్రిరూరల్: నాయకులు, కార్మికులు ఏ సంఘంలో తిరిగినా ఓటు మాత్రం బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌కు ఓటువేసి గెలిపించాలని ఆ సంఘం మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ అన్నారు. శుక్రవారం ఏరియాలోని కేకే–5 గనిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కాలంలో జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగ హక్కుతో పాటు అనేక హక్కులను సాధించామని, 200 వరకు కార్మిక అనుకూల అగ్రిమెంట్లు చేశామని వివరించారు. కొన్ని జాతీయ కార్మిక సంఘాలు పనిగట్టుకుని టీబీజీకేఎస్‌పై విమర్శలు చేస్తున్నాయని, వారు సాధించిన హక్కులేమిటో వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రాజశేఖర్, రాంచందర్, వీరారెడ్డి, రవీందర్ ఉన్నారు.